RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 14 | డిసెంబర్ 16, 2025 | వెల : రూ.3-00



3లో.. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు

# కారు పార్టీకి కష్టకాలం!



- పట్నం, పల్లెల్లోనూ పట్టు కోల్పోతున్న బీఆర్ఎస్
- మొన్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి
- నిన్న పంచాయతీల్లోనూ అంతంత మాత్రమే ప్రభావం
- కాంగ్రెస్ పై వ్యతిరేకతను క్యాష్ చేయడంలో విఫలం
- కేటీఆర్, హరీష్ తప్ప మిగతా నేతలు ఎక్కడ?
- అధికరంలో ఉన్నప్పుడు మంత్రులుగా ఉన్న నాయకులకు ఏమైంది?
- పార్టీకి, పెద్దలకు తలనొప్పిగా కవిత అంశం
- అధినేత మౌనం వ్యూహమా? విరామమా?
- పార్టీ పుంజుకునే దారేదంటూ నైరాశ్యంలో క్యాడర్

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఒక దశను పూర్తిగా ప్రభావితం చేసిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రస్తుతం స్పష్టమైన దిశ లేని పరిస్థితిలో ఉందా? పదేళ్ల పాటు నిరంతర అధికారంలో ఉండి, ఒక్కసారిగా ప్రతిపక్ష స్థానానికి పరిమితమవడం పార్టీకి గట్టి షాక్ తగిలినట్టయిందా? వ్యూహాలు పన్నడంలో పూర్తిగా గందరగోళం నెలకొందా? అంటే అలాగే కనిపిస్తోందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఒకప్పుడు తెలంగాణ రాజకీయాలను అక్షరాలా మలిచిన పార్టీ.. రాష్ట్ర రాజకీయ అజెండాను దశాబ్దకాలం తన చేతుల్లో ఉంచుకున్న శక్తి.. గ్రామం నుంచి గడపదాకా, నగరం నుంచి నియోజకవర్గం దాకా.. ప్రతి స్థాయిలో తన ప్రభావాన్ని చూపించిన బీఆర్ఎస్, ఇప్పుడు అదే రాజకీయ భూమిపై నిశ్శబ్దంగా నిలిచిపోయింది. అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న పరిస్థితి కేవలం ఒక ఎన్నికల ఓటమి ఫలితం కాదు. అది నాయకత్వం, కేడర్, వ్యూహం.. ఈ మూడు స్థాయిల్లో ఏర్పడిన గందరగోళానికి ప్రతిబింబంగా మారుతోంది. పార్టీ అధికారం కోల్పోయి రెండున్నరేళ్లు కావస్తున్నా పుంజుకునేందుకు ఏమాత్రం చర్చలు చేపట్టడం లేదనే విమర్శలు సొంత పార్టీ కాడర్ నుంచే వస్తోంది. పార్టీ అధినేత మౌనం, సీనియర్ నేతల గైర్హాజరు, జిల్లాల్లో కేడర్ చేజారిపోతున్న పరిస్థితి.. ఇవన్నీ కలిసి బీఆర్ఎస్ భవిష్యత్తుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. జూబ్లీహిల్స్ వంటి ప్రతిష్ఠాత్మక నియోజకవర్గాన్ని కోల్పోవడం నుంచి పంచాయితీ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో ప్రభావం చూపలేకపోవడం వరకు, గ్రామాల్లో ఇంకా ఉన్న నమ్మకాన్ని రాజకీయంగా మలచుకోలేకపోవడం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను క్యాష్ చేసుకోలేకపోవడం వరకు.. ప్రతి అంశం ఇప్పుడు బీఆర్ఎస్ రాజకీయ ప్రయాణంలో ఒక కీలక మలుపుగా మారుతోంది.



**- జూబ్లీహిల్స్ ఓటమి ఒక సంకేతం..**

హైదరాబాద్ రాజకీయాల్లో ప్రతిష్ఠాత్మకంగా భావించే జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్ఎస్ చేతుల్లో నుంచి చేజారిపోవడం కేవలం ఒక శాసనసభ స్థాన నష్టం మాత్రమే కాదు. అది పార్టీకి వచ్చిన మానసిక పరాజయం. ఈ సీటు ఓటమి కారణంగా నగర రాజకీయాల్లోనూ తమ పట్టు తగ్గుతోందన్న భావన బీఆర్ఎస్ కేడర్‌లో బలంగా నెలకొంది. హైదరాబాద్‌లోనే ఇలా జరిగితే జిల్లాల్లో పరిస్థితి ఎలా ఉంటుంది? అన్న ప్రశ్న కార్యకర్తల్లో ఆందోళన పెంచింది.

**- పంచాయితీ ఎన్నికలు.. గ్రామాల్లోనూ తగ్గిన ప్రభావం**

గ్రామ రాజకీయాలు ఏ పార్టీకి అయినా ప్రాణాధారం. కానీ ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభావం

మిగతా 3వ పేజీలో..

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మంత్రి నారా లోకేష్ భేటీ

- రాష్ట్రంలో టెక్ ఎకో సిస్టం అభివృద్ధిపై చర్చ
- ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్ వివరాల ప్రస్తావన
- అమెరికా పర్యటనలో టెక్ సంస్థలతో జరిగిన చర్చలపై అవగాహన
- కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో టెక్నాలజీ అభివృద్ధి లక్ష్యంగా భేటీ



**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**


ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశంలో టెక్నాలజీ ఆధారిత అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలపై పలు కీలక అంశాలపై చర్చ జరిగింది. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న ఏఐ ఆధారిత స్కిల్ పోర్టల్ వివరాలను మంత్రి నారా లోకేష్ కేంద్ర మంత్రికి వివరించారు. ఇటీవల తాను చేపట్టిన అమెరికా పర్యటన వివరాలను కూడా మంత్రి

మిగతా 3వ పేజీలో..

## భవానీ దీవిలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ!

- అమరావతి రాజధాని ప్రాంతానికి పర్యాటక ఆకర్షణ
- పీపీపీ విధానంలో 51.48 కోట్ల ప్రాజెక్టు
- రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం
- సుమారు 250 మందికి ప్రత్యక్ష ఉపాధి
- హర్షం వ్యక్తం చేస్తున్న రాజధాని ప్రజలు

**వేద న్యూస్, విజయవాడ ప్రతినిధి:**



అమరావతి రాజధాని ప్రాంతంలోని భవానీ దీవిలో భారీ పర్యాటక ప్రాజెక్టుగా 'అడ్వెంచర్ థ్రిల్ సిటీ'ని అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనకు ఆమోదం లభించింది. పర్యాటక రంగాన్ని మరింత విస్తరించడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది. మొత్తం 51.48 కోట్ల రూపాయల వ్యయంతో అమలు చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 250 మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కలగనున్నట్లు అంచనా వేస్తున్నారు. భవానీ దీవిని ఒక సంపూర్ణ వినోద, సాహస కేంద్రంగా

మిగతా 3వ పేజీలో..

## క్యాన్సర్ రోగులకు ఊరట..

- జిల్లాల్లోనే కీమోథెరపీ సేవలు
- కీలక నిర్ణయం తీసుకున్న తెలంగాణ సర్కార్
- ఇక వైద్య సేవలకు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేదు
- జిల్లాల్లో క్యాన్సర్ డే కేర్ సెంటర్లు ప్రారంభం
- ఖరీదైన కీమో ఇంజెక్షన్లు కూడా ఉచితం
- ఖమ్మం, నల్లగొండ జిల్లాలు ముందంజలో



**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి:**

తెలంగాణ ప్రభుత్వం క్యాన్సర్ రోగులకు కీలక ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇకపై కీమోథెరపీ కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా, సొంత జిల్లాల్లోనే చికిత్స పొందే అవకాశం కల్పించింది. ఈ సేవలను జిల్లాల్లో ఏర్పాటు చేసిన క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ద్వారా అందిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నెలలో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా స్థాయిలో క్యాన్సర్ డే కేర్ సెంటర్లను ప్రారంభించింది. గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ రోగులు కీమోథెరపీ కోసం హైదరాబాద్ ఎంఎన్‌జే ఆస్పత్రికి రావాల్సి వచ్చేది. రద్దీ ఎక్కువగా ఉండటంతో చికిత్స కోసం పేషెంట్లు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యకు పరిష్కారంగా జిల్లాల్లోనే కీమోథెరపీ సేవలను ప్రారంభించింది ప్రభుత్వం. డే కేర్ సెంటర్ల ప్రారంభానికి మంచి స్పందన లభిస్తోంది. కేవలం మూడు నెలల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా 400 మందికిపైగా క్యాన్సర్ బాధితులు తమ జిల్లాల్లోనే కీమోథెరపీ చేయించుకున్నారు. దీనివల్ల పేషెంట్లకు ప్రయాణ ఖర్చులు తగ్గడంతో పాటు సమయ ఆదా కూడా అవుతోంది. కీమోథెరపీ సేవలు అందించే విషయంలో ఖమ్మం మెడికల్ కాలేజీ మొదటి స్థానంలో నిలిచింది. మూడు నెలల్లో ఇక్కడ 57 మంది చికిత్స పొందారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో 47 మంది, నాగర్‌కర్నూల్‌లో 40 మంది, భద్రాద్రిలో 25 మంది,

మిగతా 3వ పేజీలో..

## 2029పై కవిత ఫోకస్!


- సీఎం లక్ష్యాన్ని స్పష్టం చేసిన కల్వకుంట్ల కవిత
- ఎక్స్ వేదికగా నెటిజన్లతో ప్రశ్నోత్తరాలు
- ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర విమర్శలు
- ప్రతి గ్రామంలో జాగృతి కమిటీలు
- తెలంగాణ నలుమూలలకు జాగృతి విస్తరణపై ఫోకస్
- రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు.

4లో..

## లింక్స్ క్లిక్ చేస్తున్నారా.. మీ ఖాతా ఖాళీనే..!

- ప్రజలకు తెలంగాణ పోలీసుల హెచ్చరిక
- సైబర్ నేరాలు పెరగడంతో అప్రమత్తంగా ఉండాలని సూచన
- నకిలీ మెసేజ్లకు, స్పందించొద్దంటున్న నిపుణులు
- ఆర్థిక నష్టంతో పాటు, మీ ప్రైవసీ కోల్పోయే అవకాశం

4లో..



వేద న్యూస్
మంగళవారం డిసెంబర్ 16, 2025

# వడివడిగా అడుగులు..

- విజయవాడ విమానాశ్రయ నూతన టెర్మినల్ పనుల్లో వేగం
- ఇప్పటికే 80 శాతం పనులు పూర్తి
- టెర్మినల్ పూర్తికి మార్చి 31 డెడ్ లైన్
- రెండు నెలల్లో ప్రారంభానికి సిద్ధం
- విజవాడను కీలక విమాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం



**వేద న్యూస్, విజయవాడ ప్రతినిధి:**

విజయవాడను కీలక విమాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీనిలో భాగంగానే.. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న నూతన సమగ్ర టెర్మినల్ భవనం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం నిర్మాణంలో 80 శాతం కంటే ఎక్కువ భాగం ఇప్పటికే పూర్తైనట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆధునిక సదుపాయాలతో ఈ టెర్మినల్‌ను మార్చి 31 నాటికి సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనులు సాగుతున్నాయి. నూతన టెర్మినల్‌లో గ్లాస్ ఫసాడ్, అంతర్గత అలంకరణలు, ఫ్లోరింగ్ వంటి ప్రధాన పనులు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రయాణికుల సామాను నిర్వహణకు కీలకమైన బ్యాగేజీ హ్యాండ్లింగ్ సిస్టమ్ ఏర్పాటు కూడా ముగింపు దశలో ఉంది. విశాలమైన వేచిచూసే హాళ్లు, ఆధునిక చెక్%-%ఇన్ కౌంటర్లు, భద్రతా వ్యవస్థలతో ప్రయాణికులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించనున్నారు. ప్రస్తుతం మిగిలిన విద్యుత్ వ్యవస్థలు, అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు, ఐటీ నెట్‌వర్క్ అనుసంధాన పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయిన తర్వాత ట్రయల్ రన్స్ నిర్వహించి, నూతన టెర్మినల్‌ను కమిషనింగ్‌కు సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వచ్చే రెండు నెలల్లో ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చే అవకాశముందని వెల్లడించారు. నూతన టెర్మినల్ ప్రారంభంతో విజయవాడ విమానాశ్రయ సామర్థ్యం గణనీయంగా పెరగనుంది. విజయవాడను కీలక విమాన రవాణా కేంద్రంగా అభివృద్ధి చేసే దిశగా ఈ ప్రాజెక్టు ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

# అందరి విశ్వాసం చూరగొంటూ..

- గడప గడపకు తిరుగుతూ ప్రచారం..
- కత్తెర గుర్తుకు ఓటేసి ఆశీర్వదించండి
- సర్పంచ్ అభ్యర్థి పూజ రాజేందర్





**వేద న్యూస్, సుల్తానాబాద్:**

తమను ఆదరించాలని కోరుతూ.. కాట్నపల్లి సర్పంచ్ అభ్యర్థి పూజ రాజేందర్ ప్రజలను కోరుతున్నారు. ప్రచారంలో వారు ముందు వరుసలో దూసుకెళ్తున్నారు. కాట్నపల్లి గ్రామంలో గడపగడపకు తిరుగుతూ ప్రజలందరి ఆశీస్సులు కోరుతున్నారు. నిండు మనసుతో ప్రతీ ఒక్కరూ తమకు మద్దతు తెలపాలని అభ్యర్థిస్తున్నారు. కత్తెర గుర్తుకు ఓటేసి తమను భారీ మెజారిటీతో సర్పంచ్‌గా గెలిపించాలని పూజ రాజేందర్ కోరుతున్నారు. తమ ఇంటి ఆడబిడ్డగా ప్రతీ ఒక్కరూ తమను ఆదరించాలని సర్పంచ్ అభ్యర్థి పూజ రాజేందర్ కోరుతున్నారు. సర్పంచ్ అభ్యర్థి పూజ రాజేందర్ దంపతులు గ్రామంలో గడపగడప తిరుగుతూ.. ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

## గ్రామాభివృద్ధికి పాటుపడే
# నాయకులనే ఎన్నుకోవాలి

- స్థానిక ఎన్నికలే ఊరు భవిష్యత్తును నిర్ణయిస్తాయి
- గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో ఎంపీ ఈటెల
- హుజూరాబాద్ నియోజకవర్గం కొండపాకలో ఇంటింటి ప్రచారం
- సర్పంచ్, వార్డ్ అభ్యర్థులకు మద్దతుగా పిలుపు
- భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి



**వేద న్యూస్, హుజురాబాద్:**

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గ పరిధిలో ఎంపీ ఈటల రాజేందర్ విస్తృతంగా పర్యటించారు. వీణవంక మండలం కొండపాక గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని, ప్రజలను నేరుగా కలుసుకొని తమ మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా కొండపాక గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఈదునూరి కుమార్ (ఉంగరం గుర్తు)తో పాటు వార్డ్ సభ్యుల అభ్యర్థులకు మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేసే నాయకత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బలమైన పాలన ఏర్పడాలంటే సర్పంచ్, వార్డ్ సభ్యుల పాత్ర కీలకమని ఎంపీ పేర్కొన్నారు. ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేసి అభివృద్ధి పనులు ముందుకు తీసుకెళ్లగల అభ్యర్థులకే ప్రజలు అవకాశం ఇవ్వాలని సూచించారు. గ్రామ అవసరాలను తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపే నాయకత్వం అవసరమని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజల భవిష్యత్తును నిర్దేశించే కీలక ఘట్టమని ఈటల రాజేందర్ అన్నారు. కొండపాక గ్రామంలో అభివృద్ధి వేగం పెరగాలంటే సర్పంచ్ అభ్యర్థి ఈదునూరి కుమార్‌తో పాటు వార్డ్ సభ్యులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజల మద్దతుతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ఆయన భరోసా ఇచ్చారు

# అభివృద్ధి దృక్పథం ఉన్న నాయకత్వమే గ్రామాలకు అవసరం



- సర్పంచ్ ఎన్నికలు గ్రామ పాలనలో కీలకం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- స్థానిక విలేకర్లతో 'వాక్ ది టాక్ విత్ జర్నలిస్ట్'
- టీ విరామంలో గ్రామీణ అభివృద్ధిపై చర్చ

**వేద న్యూస్, హుజూర్‌నగర్:**

సర్పంచ్ ఎన్నికలు గ్రామీణ పాలనలో కీలకమైనవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంతో సమన్వయంగా పనిచేసే, అభివృద్ధి దృక్పథం ఉన్న నాయకత్వం గ్రామాలకు అవసరమని పేర్కొన్నారు. సోమవారం తెల్లవారు జామున హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్థానిక విలేకర్లతో కలిసి 'వాక్ ది టాక్ విత్ జర్నలిస్ట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయపు వేళ నడక సందర్భంగా పరిసర ప్రాంతాల పరిస్థితులు, ప్రజా సమస్యలు, గ్రామీణ అభివృద్ధి అంశాలపై విలేకర్లతో చర్చించారు. నడకలో భాగంగా మార్గమధ్యంలో ఉన్న ఒక చిన్న టీ కొట్టు వద్ద మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో కలిసి టీ విరామం తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకర్లతో ముచ్చటిస్తూ.. సర్పంచ్ ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించే అభ్యర్థులను ప్రజలు ఎంపిక చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తిగత ప్రయోజనాల కంటే గ్రామ సంక్షేమాన్ని ముందుంచే అభ్యర్థులకే ప్రజలు అవకాశం ఇవ్వాలని సూచించారు. 'వాక్ ది టాక్ విత్ జర్నలిస్ట్' వంటి కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యే పాలనకు దోహదపడతాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, మీడియాతో స్వేచ్ఛగా మాట్లాడడం ద్వారా పాలన మరింత పారదర్శకంగా మారుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# విజయం సాధించే వరకూ పట్టు వదలొద్దు

- లక్ష్య సాధకులే స్ఫూర్తి కావాలి
- కష్టపడితేనే ఉన్నత స్థానానికి
- సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. పద్మావతి



**వేద న్యూస్, హైదరాబాద్:**

విద్యార్థులు లక్ష్య సాధన కోసం ఏ ఒక్క అవకాశాన్నీ వదలకుండా నిరంతరం ప్రయత్నించాలని, విజయం సాధించే వరకూ కృషి చేయాలని సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కె.పద్మావతి అన్నారు. కళాశాలలో మొదటి సంవత్సరం పిజి విద్యార్థుల కోసం 'వ్యక్తిత్వ వికాసం–నాయకత్వ లక్షణాలు' అంశంపై నిర్వహిస్తున్న మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టుదల, సంకల్పానికి ఉదాహరణగా నిలిచిన టెన్సింగ్ నార్కే లాంటి లక్ష్య సాధకులను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణా శిబిరంలో సమయ పాలన, విలువలు, కమ్యూని కేషన్ నైపుణ్యాలు, లక్ష్య సాధన వంటి అంశాలపై నిపుణుల నుండి విద్యార్థులు విషయాలను గ్రహించాలని అన్నారు. ప్రారంభ సమావేశానికి డా. ఎస్.ఈ. నైన వినోదిని, డైరెక్టర్, పిజి ప్రోగ్రామ్స్ అధ్యక్షత వహించి, ఫ్రెషర్లకు ఇలాంటి మంచి అవకాశాన్ని కల్పించినందుకు ప్రిన్సిపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వర్క్‌షాప్ తొలి రోజున గోల్స్ అండ్ డ్రీమ్స్ కమ్యూనిటీ స్థాపకుడు శ్రీ మాజిద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం, ప్రతి విషయానికి ఎదుటివారిపై ఫిర్యాదులు చేయడం వల్ల భవిష్యత్ మారదని, ఆత్మపరిశీలన చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే మార్పు వస్తుందని అన్నారు. కేవలం విద్యార్థిగానే సామర్థ్యాన్ని పరిమితం చేసుకోరాదని, భవిష్యత్తుకు అవసరమైన వ్యక్తిగా మారడానికి రేపటికోసం ఎదురుచూడకుండా ఈ రోజే ప్రయత్నం మొదలు పెట్టాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ సమావేశంలో డా.మల్లికార్జున్, డా. శారద, డా.రమేశ్ బాబు, డా.శ్రీనివాస రెడ్డి, సుమన యాదగిరి, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధాజ్ఞలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు


- పంచాయతీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- ఎన్నికలు పూర్తయ్యే వరకు ఆంక్షలు అమలు
- మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు



**వేద న్యూస్, మెదక్:**

మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు, ఐపీఎస్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు జరుగుతున్న మండలలో బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలను విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు మెదక్ జిల్లా పరిధిలోని కూల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్, చిలిపిచేడ్, శివంపేట్, ఎల్దుర్తి, మసాయిపేట్ అనే మొత్తం 7 మండలాల పరిధిలో అమలులో ఉంటాయని స్పష్టం చేశారు. ఈ మండలాల పరిధిలో గుమికూడటం, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించడం పూర్తిగా నిషేధించబడిందని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు 15వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటల నుండి ఎన్నికలు పూర్తయ్యే వరకు అమలులో ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు పోలీసు బందోబస్తు పటిష్టంగా కొనసాగుతుందని, పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేశామని వివరించారు. ఈ నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఎన్నికల సమయంలో ఎవరైనా చట్టాన్ని అతిక్రమించినా, శాంతిభద్రతలకు భంగం కలిగించినా, వెంటనే చర్యలు తీసుకోబడుతుందని హెచ్చరించారు. ఎన్నికలు శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు జిల్లా ప్రజలు పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని, ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు.

# అమృత్ 2.0 పనులు త్వరగా పూర్తి చేయాలి



- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ శ్రీదేవి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- హాజరైన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

అమృత్ 2.0 కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ సెక్రటరీ శ్రీదేవి ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని అర్బన్ లోకల్ బాడిల్లో అమృత్ 2.0 కింద చేపట్టిన పనుల పురోగతిపై హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్), మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ వీసీకి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. అమృత్ 2.0 కింద నీటి ట్యాంకుల నిర్మాణం, పైప్ లైన్ వేసే పనులను మొదలు పెట్టగా, అన్ని జిల్లాల వారీగా పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంఏ అండ్ యూడీ సెక్రటరీ శ్రీదేవి మాట్లాడుతూ.. అమృత్ 2.0 కింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. పనులను వేగంగా పూర్తి చేసేందుకు కావలసిన సామగ్రి అందుబాటులో ఉండాలని, సిబ్బందిని నియమించుకోవాలని ఆదేశించారు. ఒక ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో అమృత్ 2.0 కింద సిరిసిల్ల నియోజకవర్గంలో రూ. 100 కోట్ల నిధులతో నీటి ట్యాంకులు, పైప్ లైన్ పనులు మొదలు పెట్టారని, ఆయా పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని సూచించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలో రూ.13 కోట్లతో చేపట్టిన పనుల పురోగతిపై అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, పబ్లిక్ హెల్త్ డీఈ వరుణ్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు

- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే
- జిల్లాలో అక్రమ మద్యం, నగదు సీజ్



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన రోజు నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై 11 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే అక్రమ మద్యం విక్రయం, రవాణాపై నిఘా ఉంచి ఆకస్మిక దాడులు నిర్వహించి 98 కేసుల్లో 1525 లీటర్ల అక్రమ మద్యం, రూ. 23,28,500 నగదును సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారు, గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిని 224 కేసుల్లో 782 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, పోలీసులకు పూర్తి సహకారం అందిస్తూ స్వేచ్ఛాయుత, శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

# పొర్లు దండాలతో నిరసన

- స్మార్ట్ సిటీ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు..
- పనుల నాణ్యతలో లోపాలున్నాయి..
- డ్రైనేజీ చాంబర్లతో ధ్వంసమైన రోడ్లు
- కరీంనగర్లో యువకుడి వినూత్న నిరసన



**వేద న్యూస్, కరీంనగర్ :**

కరీంనగర్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు కిసాన్నగర్ 3వ డివిజన్లో ప్రజలకు తీరని ఇబ్బందులు కలిగిస్తున్నాయి. డ్రైనేజీ చాంబర్లు సక్రమంగా పూర్తికాకపోవడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రహదారులపై పెద్ద పెద్ద పగుళ్లు ఏర్పడి, వర్షపు నీరు-మురుగు నీరు నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ జారిపడుతుండగా, వృద్ధులు, పిల్లలు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిపై అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ దళిత మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు ప్రసాద్ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. డివిజన్లో అత్యంత దెబ్బతిన్న రోడ్డుపై పొర్లుదండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పాలకులు, అధికారులు గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నదే తన ఉద్దేశమని ఆయన తెలిపారు. స్మార్ట్ సిటీ పేరుతో కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా, పనుల నాణ్యతలో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థానికులు మండిపడ్డారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను తాత్కాలికంగా పూడ్చిపెట్టే విధానం కాకుండా శాశ్వతంగా బాగుచేయాలని డిమాండ్ చేశారు. సమస్యపై త్వరితగతిన స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కాలనీవాసులు హెచ్చరించారు.

# కాంగ్రెస్ పార్టీలో చేరిన నూతన సర్పంచ్

**వేద న్యూస్, చొప్పదండి:**



చొప్పదండి మండలంలోని మంగళపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా సర్పంచ్గా ఎన్నికైన పెద్దెల్లి శారద సురేష్ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, చొప్పదండి శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నేడు బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ప్రభుత్వ పథకాల ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి అర్హులకు అందించాలని అభివృద్ధి విషయంలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఓరుగల శేఖర్, తొంటి శ్రీనివాస్ పెద్ది మనోహర్, ఓరుగల తిరుపతి, చందముండి శ్రీనివాస్, పెద్దెల్లి పృధ్వి, కురుమ సంగం సభ్యులు, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ రోగులకు ఊరట..

కామారెడ్డిలో 19 మంది, సంగారెడ్డిలో 18 మంది కీమోథెరపీ సేవలు పొందినట్లు అధికారులు తెలిపారు. అయితే పేషెంట్లు నేరుగా జిల్లా డే కేర్ సెంటర్లకు వెళ్లరాదని వైద్య అధికారులు స్పష్టం చేశారు. ముందుగా హైదరాబాద్ ఎంఎన్జే ఆస్పత్రిలో క్యాన్సర్ నిర్ధారణతో పాటు తొలి చికిత్స నిర్వహిస్తారు. అనంతరం రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి జిల్లాలోని డే కేర్ సెంటర్కు రిఫర్ చేస్తారు. ఎంఎన్జే నుంచి వచ్చిన జాబితా ఆధారంగా నోడల్ అధికారులు పేషెంట్లను సంప్రదించి చికిత్సకు పిలుస్తున్నారు. జిల్లా డే కేర్ సెంటర్లలో కీమోథెరపీతో పాటు క్యాన్సర్ చికిత్సకు అవసరమైన 38 రకాల మందులను ఉచితంగా అందిస్తున్నారు. ఇందులో రోజువారీ టాబ్లెట్లు, క్యాప్సూల్స్తో పాటు పాక్లిటాక్సెల్, డాక్సెటాక్సెల్, ఆక్సాలిప్లాటిన్, సిస్ప్లాటిన్, కార్బోప్లాటిన్, విన్క్రిస్టిన్ వంటి ఖరీదైన కీమో ఇంజెక్షన్లు కూడా ఉన్నాయి. కీమోథెరపీ తర్వాత రోగనిరోధక శక్తి పెంచేందుకు ఉపయోగించే ఫిల్గ్రాస్టిమ్ ఇంజెక్షన్లను కూడా ఉచితంగా అందిస్తున్నారు. ఈ నిర్ణయంతో క్యాన్సర్ రోగులకు వైద్యం మరింత చేరువవుతుందని, హైదరాబాద్కు వెళ్లాల్సిన భారాన్ని తగ్గించినట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి.

# కారు పార్టీకి కష్టకాలం!

ఆశించిన స్థాయిలో కనిపించలేదు. ఒకప్పుడు గ్రామాల్లో పార్టీ మాటే చట్టంగా ఉండేది. ఇప్పుడు మాత్రం స్థానిక నాయకత్వం బలహీనంగా మారింది. కార్యకర్తలకు దిశా నిర్దేశం లేదు. పార్టీ పెద్దల నుంచి ప్రోత్సాహం కరవైంది..అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- అధినేత మౌనం వ్యూహమా? రాజకీయ విరామమా?**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయాల్లో అపార అనుభవం ఉన్న నాయకుడు. కానీ ప్రస్తుతం ఆయన రాజకీయ కార్యాచరణపై స్పష్టత లేకపోవడం పార్టీ శ్రేణుల్లో గందరగోళాన్ని సృష్టిస్తోంది. ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలు లేకపోవడం, కేడర్ను నేరుగా ఉద్దేశించి మాట్లాడే సందర్భాలు తగ్గిపోవడం.. ఇవన్నీ చూస్తుంటే అధినేత ఏం చేస్తున్నారు? అన్న ప్రశ్నకు దారితీస్తోంది. అయితే కేసీఆర్ మౌనం వ్యూహాత్మకమా? లేక రాజకీయ విరామమా? అన్నది ఇంకా స్పష్టంగా తెలియడం లేదు.

**- పల్లెల్లో పట్టున్నా ఉపయోగించుకోలేదా?**

ఇప్పటికీ గ్రామాల్లో బీఆర్ఎస్ పట్ల నమ్మకం పూర్తిగా నశించలేదు. రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, సాగునీటి ప్రాజెక్టులు పెన్షన్ స్కీంలు.. ఇవన్నీ ఇప్పటికీ ప్రజల జ్ఞాపకాల్లో ఉన్నాయి. అయితే ఆ నమ్మకాన్ని రాజకీయంగా క్యాష్ చేసుకునే ప్రయత్నం బీఆర్ఎస్ నుంచి కనిపించడం లేదు. కాంగ్రెస్పై వ్యతిరేకత ఉన్నా.. బీఆర్ఎస్ దానిని తమ పార్టీవైపు అనుకూలంగా మలచుకోలేకపోతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, పాలనపై అసంతృప్తి స్వరం వినిపిస్తోంది. హామీల అమలుపై ప్రశ్నలు, ధరల పెరుగుదలపై ఆగ్రహం ఉన్నా, దాన్ని బీఆర్ఎస్ రాజకీయ లాభంగా మలచుకోవడంలో విఫలమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**- కవిత వ్యవహారం.. అంతర్గత విభేదాలకు అద్దం**

ఎమ్మెల్సీ కవితకు సంబంధించిన పరిణామాలు బీఆర్ఎస్లో అంతర్గత అసంతృప్తిని బహిర్గతం చేశాయి. ఇది పార్టీ ఏకత్వంపై ప్రశ్నలు లేవనెత్తింది. గత కొన్ని రోజులుగా కవిత అంశం బీఆర్ఎస్ పార్టీలో, వారి కుటుంబంలో కూడా తలనొప్పిగా మారినట్లు చర్చలు జరుగుతున్నాయి. ఈ అంశం పట్ల నాయకత్వంలో సమన్వయం లోపించిందా? నిర్ణయాల్లో ఏకాభిప్రాయం లేదా? అంటూ ఇతర పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

**- కేటీఆర్, హరీష్ రావు తప్ప మిగతా నేతలంతా ఎందుకు మౌనం?**

ప్రతిపక్షంలో ఉన్నా.. బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్, హరీష్ రావు మాత్రమే యాక్టివ్గా కనిపిస్తున్నారు. మిగిలిన సీనియర్ నేతలు, మాజీ మంత్రులు మాత్రం ప్రజల్లో కనిపించడంలేదు. ఇది కేడర్లో తీవ్ర నిరాశకు కారణమవుతోంది. "పదవిలో ఉన్నప్పుడు మాత్రమే నాయకులా?" అన్న ప్రశ్న వినిపిస్తోంది. ఒకప్పుడు అధికారంతో ప్రజల మధ్య తిరిగిన మంత్రులు, ఇప్పుడు ప్రతిపక్షంలో ప్రజల కోసం పోరాడే ధోరణి చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రతిపక్షంలోనూ ప్రజలతో ఉంటేనే రాజకీయ జీవితం నిలబడుతుందన్న సూత్రం ఇక్కడ విస్మరించబడుతోందా? అన్న ప్రశ్న రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తోంది.

**- జిల్లాల్లో చేజారుతున్న క్యాడర్..**

జిల్లా స్థాయిలో పార్టీ పెద్దల మధ్య సమన్వయం లోపించడం, స్థానిక నేతల మధ్య పోటీలు, కేడర్కు సరైన దిశ లేకపోవడం.. ఇవన్నీ కలిసి బీఆర్ఎస్కు ప్రమాదకర పరిస్థితిని సృష్టిస్తున్నాయి. చోటామోటా నాయకులు కొందరు అధికార పార్టీలోకి వలస వెళ్తుంటే.. ఇంకొందరిని కాంగ్రెస్ పార్టీ నయానో భయానో తమ పార్టీలో కలిపేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది..

**- బీఆర్ఎస్ పుంజుకునేలా కొందరు**

బీఆర్ఎస్ తిరిగి బలపడాలంటే.. గ్రామస్థాయి నాయకత్వాన్ని తిరిగి నిర్మించాలని, కేడర్ను నేరుగా కలిసే కార్యక్రమాలు చేపట్టాలని, కాంగ్రెస్ వైఫల్యాలను స్పష్టంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సీనియర్ నేతలను ఫీల్డ్లోకి దిగాలని, అధినేత స్పష్టమైన రాజకీయ దిశ చూపాలని బీఆర్ఎస్లో ఎప్పటినుంచే ఉన్న క్యాడర్ బలంగా కోరుకుంటోంది.. లేకపోతే.. ఒకప్పుడు తెలంగాణ రాజకీయాలకు కేంద్రబిందువైన బీఆర్ఎస్, నెమ్మదిగా రాజకీయ అంచుల్లోకి నెట్టబడే ప్రమాదం లేకపోలేదు అంటూ.. రాజకీయ వర్గాలో చర్చ జరుగుతోంది.

# కాంగ్రెస్ బెదిరింపులకు భయపడొద్దు



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

- బీఆర్ఎస్ సర్పంచులను ఇబ్బంది పెడితే ఊరుకోం
- నమ్ముకున్న వారికి పార్టీ అండగా ఉంటుంది
- రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- సిరిసిల్లలో నూతన సర్పంచులకు దిశానిర్దేశం

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన బిఆర్ఎస్ సర్పంచులను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. వారి రక్షణ కోసం ప్రతి జిల్లాలో బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రత్యేక న్యాయ విభాగాన్ని (లీగల్ సెల్) ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్లో రాజన్న సిరిసిల్ల జిల్లా నుండి గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్, విజేతలను అభినందిస్తూ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన బిఆర్ఎస్ మద్దతుదారులు కాంగ్రెస్ పార్టీ బెదిరింపులకు భయపడవద్దని కేటీఆర్ భరోసా ఇచ్చారు. మిమ్మల్ని సస్పెండ్ చేస్తాం, ఇబ్బంది పెడతాం అని ఎవరైనా అధికారులు గానీ, పాలకపక్ష నేతలు గానీ బెదిరిస్తే ఒక్క క్షణం కూడా ఆలోచించకండి. వెంటనే పార్టీని సంప్రదించండి. మీ కోసం ప్రతి జిల్లాలో లీగల్ సెల్ ఏర్పాటు చేస్తున్నాం. అరగంటలో పార్టీ యంత్రాంగం మీకు అండగా నిలుస్తుంది.. అని ఆయన స్పష్టం చేశారు. కోర్టు ద్వారా తమ హక్కుల కోసం పోరాడదామని భరోసా ఇచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత..

కేవలం రెండేళ్ల పాలన లోనే కాంగ్రెస్ ప్రభు త్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. రైతుబంధు, రుణ మాఫీ, పెన్షన్లు, మహిళలకు తులం బంగారం వంటి హామీలను అమ లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో 40 నుండి 70 శాతం స్థానాల్లో బిఆర్ఎస్ మద్దతుదారులు గెలవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. సూర్యాపేట జిల్లాలో మల్లయ్య యాదవ్ హత్య, తిప్పర్తి లో కిడ్నాప్ వంటి ఘట నలను ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**పదవి ముఖ్యం కాదు.. పనే ముఖ్యం.**

సర్పంచులు పదవులను అలంకారప్రాయంగా కాకుండా, గ్రామ అభివృద్ధికి సాధనంగా వాడుకోవాలని కేటీఆర్ సూచించారు. సూర్యాపేట జిల్లాలోని 'ఏపూర్' గ్రామం చెక్ డ్యాంలు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వంటి నిర్మాణాలతో దేశంలోనే ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందిన విషయాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తయిన వెంటనే, గెలిచిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు పంచాయతీరాజ్ చట్టం, విధులు, హక్కులపై అవగాహన కల్పించేందుకు నిపుణులతో ప్రత్యేక వర్క్షాప్ నిర్వహిస్తామని కేటీఆర్ వెల్లడించారు.

## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్తో
# మంత్రి నారా లోకేష్ భేటీ

నారా లోకేష్ కేంద్ర మంత్రికి తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వంతో కలిసి రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్గా తీర్చిదిద్దే దిశగా సమన్వయం పెంచుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగినట్లు మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యువత నైపుణ్యాలను సమగ్రంగా గుర్తించి, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ఈ పోర్టల్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెంచేలా ఈ డిజిటల్ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి చెప్పారు. ఆ పర్యటనలో ప్రముఖ టెక్నాలజీ సంస్థలతో జరిగిన సమావేశాలు, పెట్టుబడుల అవకాశాలు, టెక్ రంగంలో భాగస్వామ్యాలపై జరిగిన చర్చలను వివరించినట్లు సమాచారం. ఈ సంప్రదింపులు రాష్ట్రంలో ఐటీ, ఏఐ రంగాల అభివృద్ధికి దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో బలమైన టెక్నాలజీ ఎకో సిస్టం అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహితంగా పనిచేయాలని మంత్రి నారా లోకేష్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. కేంద్ర%-%రాష్ట్ర సమన్వయంతో ఆంధ్రప్రదేశ్ను టెక్నాలజీ, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ముందంజలో నిలబెట్టే దిశగా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు

# భవానీ దీవిలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ!

తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇది అమరావతి - విజయవాడ ప్రాంత పర్యాటక ముఖచిత్రాన్ని మార్చే కీలక అడుగుగా భావిస్తున్నారు. ఈ అడ్వెంచర్ థ్రిల్ సిటీలో నీటి ఆధారిత వినోద పూల్స్, సాహస క్రీడా ప్రాంతాలు, గో-కార్టింగ్, జిప్లైన్, రోప్ కోర్సులు వంటి ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేయనున్నారు. అలాగే మంచు ప్రపంచం, మినియేచర్ ప్రపంచం వంటి వినూత్న విభాగాలు కూడా ప్రతిపాదించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు ఏర్పాటు చేసి, కుటుంబ సమేతంగా సందర్శించేలా సౌకర్యాలు కల్పించనున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం హోటళ్లు, రెస్టారెంట్లు, కేఫ్లు, పార్కింగ్ సదుపాయాలు, గ్యాలరీలు కూడా ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అమరావతి రాజధాని ప్రాంతం పర్యాటక కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందనుందని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నూతన సర్పంచ్, వార్డు మెంబర్లకు సన్మానం

**వేద న్యూస్, రుద్రూర్:**



రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామం లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ గంగా మణి-గంగారాంలతో పాటు వార్డు మెం బర్లను సోమవారం సహాయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహాయ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి శివకుమార్ మాట్లాడు తూ.. గ్రామాభివృద్ధిలో తమ సంస్థ సహాయ సహకారాలు అందజేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యనిర్వహణాధికారి సాంబశివరావు, కోర్భ సాయిలు, అనిల్ పటేల్, సయ్యద్ బషీర్, గంగారం, పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 16, 2025

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- సీఎం చంద్రబాబు ఆదేశాలే మార్గదర్శకం
- ప్రజా దర్బార్‌లో మంత్రి వంగలపూడి అనిత
- ప్రజల అర్జీలను నేరుగా స్వీకరణ
- పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు



**వేద న్యూస్, మంగళగిరి:**

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనలను శిరోధార్యంగా తీసుకుని పనిచేస్తున్నామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజల ఆదరాభిమానాలు పొందేలా, వారి సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమంలో మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, శాసనమండలి చీఫ్ విప్ అనురాధతో కలిసి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని శ్రద్ధగా విని, సమస్యల స్వరూపాన్ని తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సమస్యలు నేరుగా వినేందుకు ప్రజా దర్బార్ వేదికగా నిలుస్తోందని మంత్రి తెలిపారు. పాలన ప్రజలకు చేరాలంటే ఇలాంటి కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. చిన్న సమస్య అయినా, పెద్ద సమస్య అయినా ప్రభుత్వం స్పందించేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముందు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి వంగలపూడి అనిత నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే మహానుభావుడికి నిజమైన నివాళి అని మంత్రి అన్నారు.

# కేయూ ప్రతిష్టను మరింత ఉన్నతికి తీసుకెళ్లాలి



- ఫేస్ రికగ్నైజేషన్ హాజరు విధానం ప్రారంభం
- సమయపాలన, క్రమశిక్షణ అందరూ పాటించాలి
- కేయూ విసి ఆచార్య కర్నాటి ప్రతాప్‌రెడ్డి

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ యూనివర్సిటీలో ఫేస్ రికగ్నైజేషన్ ఆధారిత హాజరు విధానం ద్వారా సమయపాలన, క్రమశిక్షణ పెంపుతో పాటు విశ్వవిద్యాలయ ప్రతిష్టను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలన భవన ప్రాంగణంలో సోమవారం ఉదయం ముఖ గుర్తింపు హాజరు ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించిన సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి ఉద్యోగి తన కార్యాలయం, విభాగానికి సంబంధించిన రాక, పోకలను విధిగా నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ముఖగుర్తింపు హాజరు వ్యవస్థ సీసీటీవీ పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. 100 మందికి పైగా ఉద్యోగులు ఉన్న కార్యాలయాలు, విభాగాలలో ముఖ గుర్తింపు హాజరు పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రెగ్యులర్ అధ్యాపకులు, కాంట్రాక్టు అధ్యాపకుల కోసం మొబైల్ హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని, వీటన్నింటినీ యూనివర్సిటీ నెట్‌వర్క్ ఇన్‌చార్జ్ ద్వారా అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారిగా కాకతీయ యూనివర్సిటీ ఈ ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలులోకి తీసుకువస్తోందని తెలిపారు. ప్రారంభ దశలో సంప్రదాయ హాజరు రిజిస్టర్‌ను కొనసాగించి, తదుపరి దశలో వాటిని పూర్తిగా తొలగించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మొత్తం ఏడు ప్రదేశాల్లో ముఖ గుర్తింపు హాజరు పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం పాల్గొన్నారు. ముఖ గుర్తింపు హాజరు విధానం అమలుకు సమన్వయం చేస్తున్న యూనివర్సిటీ నెట్‌వర్కింగ్ సెల్ సంచాలకులు డాక్టర్ డి. రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి. రమ లను వైస్ చాన్సలర్ అభినందించారు.

# 2029పై కవిత ఫోకస్!



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల కవిత మరోసారి చర్చనీయాంశంగా మారారు. తాజాగా ఎక్స్ వేదికగా నిర్వహించిన 'ఆస్క్ కవిత' కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, 2029 ఎన్నికల్లో పోటీ చేస్తానని ప్రకటించారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తన ప్రధాన లక్ష్యమని, తెలంగాణ జాగృతిని గ్రామస్థాయికి విస్తరిస్తానని ఆమె స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ఎక్స్‌లో నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు కవిత సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆమె విమర్శించారు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఓ నెటిజన్ "మీ కొత్త పార్టీ పేరు ఏంటి?" అని ప్రశ్నించగా, ఆ పేరు ఎలా ఉండాలో సూచించాలంటూ కవిత స్పందించారు. మరో నెటిజన్ 2047 నాటికి తన విజన్, మిషన్ ఏంటని అడగగా, నాణ్యమైన ఉచిత విద్య, నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే తన విజన్, మిషన్ అని కవిత వెల్లడించారు. తెలంగాణ జాగృతి కార్యకలాపాలు నగరాలకే పరిమితమయ్యాయనే ప్రశ్నకు స్పందించిన కవిత, త్వరలోనే జాగృతిని గ్రామాలకు విస్తరిస్తామని, ప్రతి గ్రామంలో కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే, తమిళనాడులో జయలలిత స్వతంత్ర నాయకత్వంతో ప్రజల విశ్వాసం సంపాదించారనే వ్యాఖ్యతో పాటు, మీరు ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అంకితమైన బలమైన నాయకత్వం అందిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్న ఓ నెటిజన్ పోస్టుకు కవిత సానుకూలంగా స్పందించారు. ఇటీవల 'నాకు కూడా టైం వస్తుంది, నేనూ ఒక రోజు ముఖ్యమంత్రి అవుతాను' అంటూ కవిత ధీమా వ్యక్తం చేసిన నేపథ్యంలో, ఆమె తాజా వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో 2029లో కవిత సీఎం అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారన్న ప్రచారం మరింత జోరుగా సాగుతోంది.

# లింక్స్ క్లిక్ చేస్తున్నారా.. మీ ఖాతా ఖాళీనే..!

**వేద న్యూస్, హైదరాబాద్:**

ఇటీవల కాలంలో సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో రెచ్చిపోతున్నారు. తెలియని లింకులను, మెసేజ్ లను పంపిస్తూ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. అంతేకాదు.. పర్సనల్ డాటా సైతం చోరీ చేస్తున్నారు. కాబట్టి మొబైల్ ఫోన్లకు వస్తున్న నకిలీ సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్నారు. చిన్న లింక్‌ను క్లిక్ చేయగానే భారీగా ఆర్థిక నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. ఇటీవల మోసగాళ్లు బహుమతులు, డబ్బులు వచ్చాయంటూ లేదా ఖాతా సమస్య ఉందంటూ సందేశాలు పంపి ప్రజలను మభ్యపెడుతున్నారు. మీ పాయింట్లు గడువు ముగియబోతున్నాయి, మీకు భారీ మొత్తం బహుమతి లభించింది, వెంటనే లింక్ క్లిక్ చేయండి వంటి సందేశాలు పూర్తిగా నకిలీవని పోలీసులు స్పష్టం చేశారు. తెలియని నంబర్ల నుంచి వచ్చిన లింకులను క్లిక్ చేస్తే, మీ ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం దొంగల చేతికి వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా బ్యాంక్ వివరాలు, ఖాతా సమాచారం దుర్వినియోగం కావచ్చని హెచ్చరించారు. మోసగాళ్లు పంపే లింకులను క్లిక్ చేయడం ద్వారా ఫోన్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ అయ్యే ప్రమాదం ఉందని పోలీసులు పేర్కొన్నారు. దాంతో మీ బ్యాంక్ ఖాతా ఖాళీ కావడం, వ్యక్తిగత సమాచారం లీక్ కావడం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలంటే అప్రమత్తతే ప్రధాన ఆయుధమని తెలంగాణ పోలీసులు తెలిపారు. అనుమానాస్పద సందేశాలను వెంటనే తొలగించడం, తెలియని లింకులను క్లిక్ చేయకుండా ఉండడం, అవసరమైతే సైబర్ మోసాల సహాయ కేంద్రాన్ని సంప్రదించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని సూచించారు. ప్రజలందరూ జాగ్రత్తగా ఉండి, ఇతరులను కూడా అప్రమత్తం చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు
# పోలీసుల చర్యలు హర్షణీయం

- 'నో హెల్మెట్-నో పెట్రోల్' నిర్ణయం మంచి ఆలోచన
- ప్రజల భద్రత కోసం నిబంధనలు పాటించాలి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- హెల్మెట్ వినియోగంపై అవగాహనకు ప్రశంసలు



**వేద న్యూస్, అమరావతి ప్రతినిధి:**

రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించేందుకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన చర్యలు హర్షణీయమని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అభిప్రాయపడ్డారు. ప్రమాదాల కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని సీఎం పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని "నో హెల్మెట్.. నో పెట్రోల్" నిబంధనను అమల్లోకి తీసుకురావడం మంచి ఆలోచనగా సీఎం అభినందించారు. ఈ తరహా నిర్ణయాలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంలో దోహదపడతాయని తెలిపారు. భద్రత అనేది వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని సీఎం స్పష్టం చేశారు. ఈ నిబంధనపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తిరుపతి జిల్లాలో 700 ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన హెల్మెట్ అవగాహన బైక్ ర్యాలీని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. పోలీసు సిబ్బందితో కలిసి ఈ ర్యాలీని ఘనంగా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. అవగాహన కార్యక్రమాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు తీసుకెళ్లినప్పుడే ఫలితం ఉంటుందని ఆయన అన్నారు. ఈ అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు స్వయంగా పాల్గొనడం ద్వారా సమాజానికి మంచి సందేశం ఇచ్చారని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజల భద్రత కోసమే ప్రభుత్వం నిబంధనలు, సూచనలు తీసుకువస్తుందని, వాటిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలను కోరారు.

# మంత్రి దామోదర్ ని కలిసిన సర్పంచ్ మాధవి నరసింహారెడ్డి



**వేద న్యూస్, టేక్మాల్:**

టేక్మాల్ మండల పరిధిలోని ఎలుపేట్ గ్రామ పంచాయతీ కాంగ్రెస్ నాయకులు తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహను సంగారెడ్డి లో మంత్రి నివాసంలో కలిశారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి సర్పంచ్ గా ఎల్లారెడ్డి గారి మాధవి నరసింహారెడ్డి గెలుపొందారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్, కుమ్మరి లక్ష్మయ్య వార్డు సభ్యులతో మంత్రి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే మంత్రి మాధవికి శాలువా కప్పి అభినందించరు. గ్రామాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఆయనకు సూచించారు. ఇందులో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. రాములు,శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి, సంజీవ్ రెడ్డీ, నూతన వార్డు మెంబర్లు, జనార్ధన్, నర్సింహా గౌడ్, కమలాకర్, అశోక్, సదాకలి, ఎర్ర గండి సాయిలు, కార్యకర్తలు యాకోబు, యేసేఫ్, సుమన్, బి, బాలయ్య చేర్మెన్, జె.బాలు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతిపై ఇంచార్జి కలెక్టర్ సమీక్ష

- ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమావేశం



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

భూ భారతి అమలుపై ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్షించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు, తహసీల్దార్లతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. భూ భారతి, సాదా బైనమా, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. భూ భారతి లో ఉన్న ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల వివరాలు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రణాళిక ప్రకారం కసరత్తు చేసి పనులు పూర్తి చేయాలని సూచించారు. సమీక్షలో ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, పర్యవేక్షకులు వేణు, సురేష్, ఆయా మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న
# బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి చంద్రమౌళి



**వేద న్యూస్ ,శాయంపేట :**

శాయంపేట గ్రామ మాజీ సర్పంచ్, శాయం పేట గ్రామ బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి వలుపదాసు చంద్రమౌళి సోమవారం కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కాగా, వారికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణ రావు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రమౌళి మాట్లా డుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. ఈ సర్పంచ్ ఎన్నికల్లో శాయంపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బాసాని శాంత రవి కు తన పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు తెలిపారు.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 16, 2025

# గెలిచిన సర్పంచులను సన్మానించిన ఎమ్మెల్యే డా.సంజయ్



**వేద న్యూస్, జగిత్యాల :**

జగిత్యాల పట్టణ పొన్నాల గార్డెన్స్ లో జగిత్యాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బలపరిచిన 70 మంది సర్పంచులు మరియు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందగా 65 మంది గ్రామ పంచాయతీ సర్పంచ్ ,ఉప సర్పంచ్ పాలకవర్గ సభ్యులను జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ శాలువాతో సత్కరించి అభినందించారు.

# మూడవ విడత ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్




**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి :**

జిల్లాలో ఈ నెల 17న నిర్వహించనున్న మూడవ విడత ఎన్నికల నేపథ్యంలో నర్సంపేట, ఖానాపూర్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల ఎంపిడిఓ కార్యాలయాలను సందర్శించి చేపడుతున్న పోలింగ్ ఏర్పాట్లను వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద సోమవారం వివరంగా పరిశీలించారు. నాలుగు మండలాల్లో జరగనున్న పోలింగ్‌కు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, పోలింగ్ సామగ్రి పంపిణీ, బ్యాలెట్ బ్యాక్స్ లకు సీల్, లాజిస్టిక్స్ నిర్వహణ, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, భద్రతా చర్యలు తదితర అంశాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ,పోలింగ్ రోజున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమర్థవంతమైన, పారదర్శకమైన మరియు ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి స్థాయిలో ఖచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న లోపం కూడా చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన బ్యాలెట్ పేపర్లు, ఎన్నికల సామగ్రి, సీలింగ్ మెటీరియల్, రవాణా ఏర్పాట్లు, సిబ్బంది క  పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భనలో ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి,  జెడ్పి సీఈవో రాంరెడ్డి, ఆర్డిఓ ఉమారాణి, సుమా, జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, డిబిసిడివో పుష్పలత, డి ఎస్ సి డి వో భాగ్యలక్ష్మి, సంబంధిత మండలాల తహసీల్దార్లు ఎంపిడిఓలు అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం




**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండల పరిధిలోని పలు గ్రామాల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణ రావు గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాలు మారాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. అనంతరం శాయంపేట గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి వాసానికి శాంతా రవిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని, గ్రామాల్లో ఓటు అడిగే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి వారు వివరించారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పై నమ్మకం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, బాసాని చంద్రప్రకాష్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారపల్లి రవీందర్, చిందం రవి, మార్కండేయ, వరదరాజు, కటయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో ప్రారంభమైన ఎన్ఈపీ ఓరియంటేషన్ అండ్ సెన్సిటైజేషన్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం మాలవియా మిషన్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం సంయుక్త నిర్వహణలో ఎన్ఈపీ ఓరియంటేషన్ అండ్ సెన్సిటైజేషన్ ఆన్‌లైన్ కార్యక్రమం సోమవారం సాయంత్రం ప్రారంభించారు. కేయూ తరపున ఈ కార్యక్రమాన్ని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డా. బి. రమ, విభాగ సహాయ ఆచార్యులు డా.డి.రమేష్ సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ.. విద్యా వ్యాప్తిలో సమానత్వాన్ని పెంపొందించడంతో పాటు బోధన నాణ్యతను మెరుగుపరచడంలో డిజిటల్ సాంకేతికత జాతీయ విద్యా విధానం ఎన్ఈపిలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సౌకర్యవంతమైన, సమ్మిళిత, అభ్యాసకేంద్రీకృత విద్యకు మద్దతుగా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఆన్‌లైన్ అభ్యాస సాధనాలు, వర్చువల్ ప్రయోగశాలలు, ఈ-కంటెంట్ వినియోగాన్ని ఎన్ఈపీ ప్రోత్సహిస్తుందన్నారు. కాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి. మనోహర్ మాట్లాడుతూ.. జాతీయ విద్యా విధానం 2020 భారతదేశ విద్యా వ్యవస్థలో ఒక మైలురాయి సంస్కరణగా నిలుస్తుందని, ఇది ఉన్నత విద్యను సమగ్ర, బహుళ విభాగ, సమ్మిళిత మరియు నైపుణ్యాధారితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించబడిందన్నారు. ఈ దార్శనికతను ఆచరణలోకి తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. రాబోయే ఎనిమిది రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో బహుళ విభాగ విద్య, భారతీయ జ్ఞాన వ్యవస్థలు, విద్యా నాయకత్వం , పాలన, పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్య అభివృద్ధి, సమ్మిళిత విద్య, ఐసీటీ ఏకీకరణ, సంస్థాగత స్వయంప్రతిపత్తి, పాఠ్యాంశాల రూప కల్పన, మూల్యాంకనం వంటివి ఎన్ఈపీ 2020 ప్రధాన అంశాలపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం యూజీసీ కెరీర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్ కాష్ అవసరాలకు అనుగుణంగా ఉందని పేర్కొని, పాల్గొనే వారందరూ సెషన్లలో చురుకుగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



- పాల్గొన్న వివిధ విభాగాధిపతులు

# రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖతం

- పంచాయతీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైంది
- కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం పరువు కాపాడుకునేందుకే..
- యువరాజుగా ఉన్నప్పుడే నీ మెజారిటీ తగ్గింది
- హత్యా రాజకీయాల ఆరోపణలు హాస్యాస్పదం
- బీఆర్ఎస్ అప్పుల భారం మోస్తూనే కాంగ్రెస్ పాలన
- కేటీఆర్ పై రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఫైర్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఖతం అయ్యిందని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి, రెండవ విడుత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైందని, కేవలం పరువు కాపాడుకోవడం కోసమే, మూడో విడత ఎన్నికల ప్రచారంలో లబ్ధి పొందడానికి కేటీఆర్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారని మండిపడ్డారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో బీఆర్ఎస్ కేవలం 60 స్థానాల వద్దే ఆగిపోయిందని, కానీ కేటీఆర్ మాత్రం 83 స్థానాలు గెలిచాం అని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. ఇది ఎన్నికల్లో గెలవలేక పరువు నిలుపుకునే ప్రయత్నంలో చేస్తున్న తప్పుడు అంకెల గారడీ అని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. 83 సీట్లు గెలిచిన పేర్లు చెప్పగలరా అని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. రెండు విడతల్లో రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీదే హవా అని, మూడో దశలో కూడా మెజారిటీ స్థానాలు తామే సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. 2009 ఎన్నికల్లో కేటీఆర్ కేవలం 175 ఓట్ల తేడాతోనే గెలిచారనే వాస్తవాన్ని మర్చిపోకూడదని గుర్తు చేశారు. యువరాజుగా చక్రం తిప్పిన కేటీఆర్‌కు 2023 ఎన్నికల్లో మెజారిటీ ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. యువరాజుగా ఉన్నప్పుడే నీ మెజారిటీ 89 వేల నుండి 27 వేలకు దిగజారిందని విమర్శించారు. తాను ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉన్నానని, కేటీఆర్ లాగా ప్రజలను విడిచిపెట్టి పట్టణానికి పారిపోలేదని ఘాటుగా విమర్శించారు. కేటీఆర్ సొంత చెల్లి పార్టీని వదిలి వెళ్లారని, ఆమె చేసిన కామెంట్లకే సమాధానం చెప్పుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. భూ కబ్జాలపై ఆమె వేసిన ప్రశ్నల వర్షానికి ముందు సమాధానం చెప్పాలన్నారు. కేటీఆర్ హత్యా రాజకీయాలపై మాట్లాడడం హాస్యాస్పదం అని ప్రభుత్వ విప్ అన్నారు.  వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయకుని గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే, చంపడానికి యత్నించిన బీఆర్ఎస్ పార్టీ హత్యా రాజకీయాల గురించి మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు. ఓటమి అక్కసుతోనే ఒక దళిత నాయకునిపై బీఆర్ఎస్ దాడి చేసిందని ఆరోపించారు. “గ్రామాల్లో సర్పంచ్‌లు ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేదు, మూడవ విడత పంచాయతీ ఎన్నికలు పూర్తి కాలేదు కానీ కేటీఆర్‌కు అప్పుడే లీగల్ సెల్ ఏర్పాటు చేస్తాను అంటున్నారు” అని, ఈ లీగల్ సెల్ పార్టీని కాపాడుకోవడానికేనని విమర్శించారు.కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల కోట్ల అప్పుతో వదిలిపెట్టిపోయిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అప్పును భరిస్తూనే అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ముందుకు వెళ్తోందని స్పష్టం చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పది రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని, అబద్ధపు ప్రచారాలు సరికాదు కేటీఆర్ అని, వారు చేసిన రుణమాఫీ ‘మిత్తులకే’ సరిపోయిందని విమర్శించారు.

# కాంగ్రెస్ గూండాగిరి దారుణం

- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయి
- బీఆర్ఎస్ అభ్యర్థిపై ట్రాక్టర్‌తో హత్యాయత్నంపై కేటీఆర్ ఫైర్
- ఎస్పీకి ఫోన్ చేసి చర్యలు తీసుకోవాలని కోరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- చట్టం పని చేయకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయంటూ హెచ్చరిక




**వేద న్యూస్, కామారెడ్డి ప్రతినిధి:**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు తీవ్రంగా క్షీణిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సోమార్‌పేట్ గ్రామంలో చోటుచేసుకున్న దారుణ ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ నేతలు అధికార మదంతో విర్రవీగుతూ బీఆర్ఎస్ అభ్యర్థిపై హత్యాయత్నానికి పాల్పడటం పిరికిపంద చర్యగా కేటీఆర్ విమర్శించారు. సోమార్‌పేట్ గ్రామంలో సర్పంచ్ ఎన్నికల ఫలితాల అనంతరం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీఆర్ఎస్ తరపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసిన బిట్ల బాలరాజు తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఇంటి ముందు కూర్చుని ఉన్న సమయంలో, ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి, స్థానిక మండల అధ్యక్షుడు సాయిబాబా ట్రాక్టర్‌తో అక్కడికి వచ్చి బీభత్సం సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరంటూ విర్రవీగుతూ నిల్చున్న వారిపైకి ట్రాక్టర్ ఎక్కించి ఢీకొట్టినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఈ ఘటనలో బాలరాజుతో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు తీవ్రంగా గాయపడగా, స్థానికులు వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటన విషయం తెలుసుకున్న వెంటనే కేటీఆర్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, గాయపడిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. పార్టీ వారి వెంట ఉంటుందని, అధైర్యపడవద్దని ఆయన భరోసా కల్పించారు. అనంతరం కేటీఆర్ స్వయంగా కామారెడ్డి జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి సోమార్‌పేట్ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉందన్న అహంకారంతో కాంగ్రెస్ నేతలు హత్యాయత్నాలకు పాల్పడుతుంటే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని స్పష్టంగా డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ శ్రేణులు చూస్తూ ఊరుకోబోవని కేటీఆర్ హెచ్చరించారు. చట్టం తన పని తాను చేయకపోతే ప్రజలు, కార్యకర్తలు తిరగబడే పరిస్థితి వస్తుందని, అప్పుడు శాంతిభద్రతల సమస్య మరింత తీవ్రమవుతుందని స్పష్టం చేశారు. గూండాగిరికి పాల్పడుతున్న కాంగ్రెస్ నేతలను కట్టడి చేయాల్సిన బాధ్యత పూర్తిగా పోలీసులదేనని కేటీఆర్ తేల్చిచెప్పారు.

# 117 ఫిర్యాదులు..!

**వేద న్యూస్, జిడబ్ల్యూఎంసి :**

ఫిర్యాదుల పరిష్కారం కోసం  ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు  బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్)కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమం లో  కమిషనర్  ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన  ఫిర్యాదులు విభాగాల వారిగా టౌన్ ప్లానింగ్ 63,  ఇంజనీరింగ్41,రెవేన్యూ04, హెల్త్ శానిటేషన్03, నీటి సరఫరా05, హార్టికల్టర్01 మొత్తం 117 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్,  డిఎఫ్ఓ  శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, బిర్రు శ్రీనివాస్ ,టిఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు



- ప్రజావాణిలో ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరించిన కమిషనర్

# మూడో విడత ప్రచారానికి తెర

**వేద న్యూస్, శాయంపేట:**

శాయంపేట మండలంలో గ్రామపంచాయతీ ఎన్నికల జోష్ తారస్థాయికి చేరుకుంది మూడో విడతలో శాయంపేట మండలంలో 12 రోజులుగా హెూరెత్తిన  ప్రచారం సోమవారం ఐదు గంటలకు తెరపడింది .ఈనెల 17న పోలింగ్ జరగనుంది 23 గ్రామపంచాయతీలో 212 మంది సర్పంచ్ అభ్యర్థులు, 50 వార్డులకు 455 మంది బరిలో ఉన్నారు. పార్టీ నేతలు గ్రామంలో చుట్టేస్తూ అభ్యర్థుల గెలుపు కోసం శ్రమిస్తున్నారు. అధికారులు భద్రత పోలింగ్ ఏర్పాట్లు  పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల వేడి పెరిగిన నేపథ్యంలో మద్యం దుకాణాలు బందు చేయడానికి ఎక్సైజ్ సిబ్బంది సిద్ధమైంది. ఇప్పటికే గ్రామంలో రహస్యంగా మద్యం డబ్బింగ్ ,స్టాక్ తరలింపుతో పోరు మరింత వేడెక్కింది.

వేద న్యూస్

మంగళవారం డిసెంబర్ 16, 2025

# నిర్దేశిత గడువులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి



**– కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

**వేద న్యూస్, జిడబ్ల్యుఎంసి :**

నిర్దేశిత గడువులో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అధికారులతో ఇంజనీరింగ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడం తో పాటు సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లో భాగం గా ఉన్న బయో మైనింగ్, స్వీపింగ్ మిషన్ ల నిర్వహణ తదితర పనులను పూర్తి చేయాలని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో ఎస్ ఈ సత్యనారాయణ, ఈఈ లు మహేందర్, రవి కుమార్, సంతోష్ బాబు, మాధవి లత ఏఈ లు నరేష్, సంతోష్ కుమార్ స్మార్ట్ సిటీ ప్రతినిధి ఆనంద్ ఓలేటి తదితరులు పాల్గొన్నారు.

# ఆధునికరించిన కంప్యూటర్ ల్యాబ్ ఆవిష్కరణ




**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అమెరికా తెలుగు సంఘం, సీకేఎం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో అత్యాధునిక సౌకర్యాలతో ఆధునికరించిన కంప్యూటర్ ల్యాబ్ ను తెలంగాణ అమెరికా సంఘం ప్రతినిధులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ధర్మారెడ్డి రిబ్బన్ కత్తిరించి ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ధర్మారెడ్డి మాట్లాడుతూ విద్యా వైద్య రంగాలు అందరికీ అందుబాటులోకి వచ్చినప్పుడే సమాజంలో చైతన్య వస్తుందని గ్రహించిన ఓరుగల్లు పుర ప్రముఖులు 1970 వ దశకంలో ఆచార్య చందాకాంతయ్య శ్రేష్టి రూ. 1లక్ష విరాళంగా అందించడంతో సికెఎం డిగ్రీ కళాశాలకు అంకురార్పణ చేయడం జరిగిం దని తెలిపారు. అనంతరం మార్గదర్శకులుగా పిలిచిన ఆచార్య జయశంకర్ కృషితో ఈ కళాశాల ఎయిడెడ్ కళాశాలగా రూపుదిద్దుతుందని తెలిపారు. అప్పటినుండి ఎందరో ఉన్నత విద్యను అందిపుచ్చుకొని ప్రపంచంలోని వివిధ దేశాలలో వివిధ రంగాలలో స్థిరపడి సేవలు అందిస్తున్నారని తెలిపారు. సీకేఎం కళాశాల విద్యను అందించడం తోపాటు విద్యార్థులు సామాజిక స్పృహను కలిగించి నట్లు తెలిపారు. ఎన్నో రంగాలలో ఎంతోమంది ఉన్నత శిఖరాలను అందుకున్నారని తెలిపారు. గతంలో సీకేఎం కళాశాలలో 80 మంది అధ్యాపకులు, 66 మంది బోధ నేతర సిబ్బంది , 3 వేల మంది విద్యార్థులు ఉండేవారని ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన మార్పులతో క్రమేపి అధ్యాపకుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని తెలిపారు. దీనితో చందాకాంతయ్య స్ఫూర్తిని భావితరాలకు అందించాలని సంకల్పంతో ఈ కళాశాల ప్రభుత్వ పరం చేయాలని పాలకమండలి నిర్ణయించడంతో 2023 లో సికెఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గా మారిందని తెలిపారు. ప్రస్తుత మార్కెట్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా సైన్స్, పైతాన్ తదితర కోర్సులకు మంచి డిమాండ్ ఉందని కానీ వాటికి తగిన విధంగా కళాశాలలో కంప్యూటర్ సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో ఇదే కళాశాలలో చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడిన తెలంగాణ అమెరికా తెలుగు సంఘం, మారిటెక్ హైదరాబాద్ సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చి కళాశాలలో 50 ఆధునిక కంప్యూటర్లను లేటెస్ట్ వర్షన్లతో అందించేందుకు ముందుకు రావడం ఎంతో హర్షించదగిన విషయమని అభినందించారు. ఈ కళాశాల అభివృద్ధికి రెండు ఏసీలు అందించిన సీకేఎం పూర్వ విద్యార్థులను అభినందించారు. అనంతరం తెలంగాణ అమెరికా తెలుగు సంఘం అధ్యక్షుడు ఎం నవీన్ రెడ్డి, గూడూరు శ్రీనివాస్ లు మాట్లాడుతూ పేద విద్యార్థులకు సేవలు అందించేందుకు తెలంగాణ అమెరికా సంఘం ముందు ఉంటుందని తెలిపారు. కంప్యూటర్లు ఇవ్వడంతో పాటుగా వైఫై సౌకర్యం కూడా కల్పిస్తామని విద్యార్థులు ఆ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మారిటెక్ సంస్థ ప్రతినిధి అనిల్ ఎర్రం రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ఉపాధి లభించే కోర్సులకు తగిన లేటెస్ట్ వర్షన్లతో కంప్యూటర్లను అందజేశామని వీటిని మీరు వినియోగించుకొని నైపుణ్యాలు పొందితే ఆ కళాశాలకు కావలసిన సౌకర్యాలు మేము అందిస్తామని వాటిని సరిగా చూసుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు అధ్యాపకులు దేనిని సూచించారు. సీకేఎం వరంగల్ అలుమ్ని అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజన్ బాబు మాట్లాడుతూ విద్యార్థులకు ఎవరికివారు స్వయంగా క్రమశిక్షణను అలవర్చుకోవాలని అప్పుడే మీరు ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారని సూచించారు. కళాశాలకు, పేద విద్యార్థుల సంక్షేమం కోసం సీకేఎం అలుమ్ని కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం అతిథులను ఘనంగా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే ఎల్ వి ప్రసాద్ రావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బి విజయపాల్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ సతీష్ , ఆయేషా, వసుధ,లైబ్రరియన్ ఎస్ అనిల్ కుమార్, సూపర్ండెంట్ జి. శ్రీనివాస్ అధ్యాపకులు ఏ. హరిబాబు, ఎన్ స్రవంతి, పి. సుమన్, జయంతి, మమత , ఎన్సిసి క్యాడేట్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల పుడితే రూ.2016

- సర్పంచ్ అభ్యర్థి గడ్డి శ్రీనివాస్ మేనిఫెస్టో విడుదల
- గ్రామ ప్రజల శ్రేయస్సు, గడ్డివానిపల్లి డెవలప్‌మెంట్‌యే లక్ష్యం
- బాండ్ పేపర్‌పై పలు కీలక హామీలు.. కత్తెర గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

**వేద న్యూస్, ఇల్లందకుంట:**

ఇల్లందకుంట మండల పరిధిలోని గడ్డివానిపల్లి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గడ్డి శ్రీనివాస్ కీలక మేనిఫెస్టో విడుదల చేశారు. సర్పంచు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన సోమవారం పలు కీలక హామీలతో బాండ్ పేపర్ పై ప్రామిసెస్ వెల్లడించారు. ఆంజనేయ స్వామి గుడిలో పూజారికి బాండ్ పేపర్ అందజేసి, పూజలు చేశారు. గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా తనను ఎన్నుకుంటే తాను కానీ తన కుటుంబం కానీ ఇప్పుడు ఉన్న ఆస్తులకు మించి అక్రమంగా ఎంత సంపాదించినా.. అలా పెరిగిన వాటిని గ్రామ పంచాయితీ జప్తు చేసి ప్రజలకు పంచవచ్చునని తెలియజేస్తూ వెల్లడించారు. భూముల పట్టాలు చేపించటానికి డబ్బులు తీసుకోబోనని, పెన్షన్లు మంజూరుకు, సదరం సర్టిఫికెట్లకు డబ్బులు తీసుకోబోనని, పంచాయతీలు వాయిదా వేసి జమానత్ డబ్బులు ఆపుకోబోనని, కుటుంబంలో ఉన్న అన్నదమ్ముల, తండ్రి కొడుకుల గొడవలను ప్రోత్సహించబోనని,గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ సామగ్రి లేదా బోర్ మోటార్లు కానీ పోతే తక్షణమే చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇంకుడు గుంతల డబ్బులు వాడుకోబోనని, బాత్రూం కడితే వచ్చే బిల్లులను పక్కదారి పట్టించబోనని చెప్పారు. తూర్పు వాడ సైడ్ కాలువలు తక్షణమే చేపిస్తానని,వర్షాకాలం నీటితో మునిగిపోతున్న శ్మశాన వాటికకు మరమ్మతులు చేపిస్తానని,అన్నాడి తిరుపతిరెడ్డి ఇంటి నుండి బస్ స్టేషన్ వరకు రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. అంబేద్కర్ భవనానికి కృషి చేస్తానని, సల్పల సాయిలు ఇంటి నుండి పోచమ్మ గుడి కలుపుకొని శ్మశాన వాటిక తో పాటు మదనమ్మ గుడి వరకు రోడ్డు నిర్మాణం చేపడతానని వెల్లడించారు. అర్హులైన వారికీ వృద్ధాప్య, వితంతు పెన్షన్ల కోసం కృషి చేస్తానని, బీరన్న గుడికి అదనపు గది నిర్మాణం చేపిస్తానని పేర్కొన్నారు. గ్రామంలో పెండింగులో ఉన్న 8 సీసీ రోడ్డు లింకుల నిర్మాణానికి పాటు పడతానని, రెడ్డి సంఘ భవనాన్ని మంజూరు చేసుకొని దాన్ని ఫంక్షన్ హాల్ గా చేసేలా కృషి చేస్తానని స్పష్టంచేశారు.




**పలు కీలక హామీలు**

మధ్యలో ఆగిపోయిన యాదవ సంఘ భవనాన్ని పూర్తి చేస్తానని, ప్రతి కుటుంబంలో ఆడపిల్ల పుడితే ఒక్కరికి రూ.2,016 ఫిక్స్డ్ డిపాజిట్ చేసి ఇస్తానని, ప్రభుత్వ అధికారులతో మాట్లాడి స్వర్గ రథం ఏర్పాటు కి కృషి చేస్తానని, ప్రభుత్వ పథకాలను అర్హులైన లబ్దిదారులకు పార్టీలకు అతీతంగా అందచేస్తానని హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఆదాయ–వ్యయ వివరాలను గ్రామ సభనిర్వహించి గ్రామ ప్రజలకి వివరిస్తానని, వాట్సాప్ వేదికగానూ తెలియజేస్తానని పేర్కొన్నారు. వీధి కుక్కల బెడద లేకుండా చేస్తానని, ప్రతి వీధిలో చెత్త కుండీల ఏర్పాటు గ్రామ పంచాయితీ సిబ్బందితో ఒక్కరికి బాధ్యత ఇచ్చి మన గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా మార్చి మొదటి స్థానంలో నిలబెడతానని తెలిపారు. ప్రతి మూడు నెలలకొకసారి హెల్త్ క్యాంపు ఏర్పాటు చేస్తానని, అంగరంగ వైభవోపేతంగా మన ఆడబిడ్డలు జరుపుకొనే బతుకమ్మ పండుగకు లైటింగ్, సౌండ్, ఏర్పాటు చేస్తానని చెప్పారు.దురదృష్టవశాత్తు గ్రామస్తులకుటుంబ సభ్యులలో ఎవరైనా మరణిస్తే తన వంతు సహాయం గా బియ్యాన్ని అందజేస్తానని హామీనిచ్చారు. గ్రామంలోని పిల్లలకు ప్రత్యేకంగా ఉపాధ్యాయుడును ఏర్పాటు చేసి ట్యూషన్లు చెప్పిస్తానని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తన నిధుల నుంచి రూ.25 లక్షలు, హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్ చార్జి వొడితల ప్రణవ్ రూ.20 లక్షలు గ్రామానికి డెవలప్‌మెంట్ కోసం ఇస్తామన్నారని శ్రీనివాస్ చెప్పారు. ఆ నిధులను తీసుకొచ్చే బాధ్యతన తనదని, తనను సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధి కోసం ఒక్కసారి తనకు అవకాశం ఇవ్వాలని, కత్తెర గుర్తుకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

# పలు హామీలతో మేనిఫెస్టో

- వెంకటేశ్వర్లపల్లి సర్పంచ్ అభ్యర్థి దొగ్గల సౌజన్య భాస్కర్ రిలీజ్
- ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన

**వేద న్యూస్, జమ్మికుంట:**



కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వెంకటేశ్వర్లపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి దొగ్గల సౌజన్య భాస్కర్ పలు హామీలతో మేనిఫెస్టో విడుదల చేశారు. గ్రామంలో కోతుల బెడద నివారించుటకు వాటిని పునరావాస కేంద్రాలకు తరలించుటకు నూటికి నూరు శాతం కృషి చేస్తానని, గోవిందాపూర్ శివారు నుండి విలాసాగర్ రోడ్డు వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎస్టిమేషన్ అయినదనీ, దాని నిర్మాణం కోసం నూటికి నూరు శాతం కృషి చేస్తానని చెప్పారు. గ్రామంలో యువకుల కోసం ఓపెన్ జీమ్ ఏర్పాటు, వైకుంఠదామ రథం కోసం, డెడ్ బాడీ ఫ్రీజర్ ఏర్పాటుకు, మహిళా సంఘ భవన నిర్మాణం కోసం లైబ్రరీ ఏర్పాటు కొరకు కృషి చేస్తానని తెలిపారు. పల్లె దవాఖానా కోసం, అంబేద్కర్ చౌరస్తా నుండి వొద్దిపల్లె వరకు స్ట్రీట్ లైట్ల కోసం , రోడ్లకు సంబంధించి పలు హామీలను ఇచ్చారు.హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సహకారాల ద్వారా హామీల అమలుకు నూరు శాతం కృషి చేస్తానని తెలిపారు. తనకి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు.

# పంచాయతీ ఎన్నికల్లో వివాదం

- మిస్సైన ఓటుతో ఫలితం తారుమారు అయినట్లు ఆరోపణలు
- ఓటు లెక్కింపులో తప్పిదం
- టాస్‌తో కాంగ్రెస్ అభ్యర్థికి విజయం
- బీఆర్ఎస్ అభ్యర్థి ఫిర్యాదు

**యాదాద్రి భువనగిరి జిల్లా, వేద న్యూస్ :**



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎన్నికల అధికారుల తీరుపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఓటు లెక్కింపులో మిస్ కావడంతో ఫలితం మారిపోయిందని పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ అభ్యర్థి ఓటమి పాలయ్యారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. వాసాలమర్రి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 1236 ఓట్లు పోలవగా, అందులో 14 ఓట్లు చెల్లనివిగా, మూడు ఓట్లు నోటాకు పడ్డాయి. మిగిలిన ఓట్లలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి, కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థికి చెరో 609 ఓట్లు పోలయ్యాయి. దీంతో ఇరు అభ్యర్థులకు సమాన ఓట్లు వచ్చాయని ప్రకటించిన ఎన్నికల అధికారులు టాస్ నిర్వహించి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని విజేతగా ప్రకటించారు. అయితే రెండో వార్డులో మొత్తం 119 ఓట్లు పోలవగా, లెక్కింపు సమయంలో అధికారులు 118 బ్యాలెట్ పేపర్లను మాత్రమే చూపించారని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఆ మిస్సైన ఓటు గురించి ప్రశ్నించినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. మరుసటి రోజు కౌంటింగ్ రూమ్ సమీపంలో పరిశీలించగా, గది కిటికీ బయట మిస్సైన ఓటు లభించిందని పేర్కొన్నారు. ఆ బ్యాలెట్‌లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికే ఓటు పడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఉషారాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రజాస్వామ్యానికి తీరని నష్టం జరిగిందని ఆరోపించారు. లభించిన ఓటుతో పాటు అన్ని ఆధారాలను జతచేసి జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల అధికారిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# పర్యావరణ పరిరక్షణ హైడ్రాతోనే సాధ్యం ప్రజావాణిలో వినతులు

**హైదరాబాద్, వేద న్యూస్ :**

చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూములు, పార్కులు, ప్రజావసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. చెరువులు –నాలాలను పరిరక్షించి పరస్పరం అనుసంధానం చేస్తేనే వరదల సమస్య లేని నగరాన్ని చూడగలమని పేర్కొన్నారు. ఈ క్రమంలో చెరువుల సంరక్షణ చేపడుతున్న హైడ్రా, ఖాళీ ప్రభుత్వ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరారు. సోమవారం నిర్వహించిన హైడ్రా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 46 ఫిర్యాదులు అందాయి.లే అవుట్‌లలో ప్రజావసరాలకు కేటాయించిన స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేసి పర్యావరణానికి ఊపిరి ఇవ్వాలని పలువురు కోరారు. నివాస ప్రాంతాల మధ్య ఉన్న చిన్న ప్రభుత్వ భూములకు కంచెలు వేసి, పచ్చదనంతో కూడిన పార్కులుగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. నిజాంపేటలోని తుర్క చెరువు కింద ఉన్న ప్రభుత్వ భూములను పార్కులుగా అభివృద్ధి చేయాలని, మేడ్చల్ జిల్లా కాప్రా మండలం చిన్న చెర్లపల్లిలోని వెంకట రెడ్డి కాలనీలో పార్కు స్థలం కబ్జాకు గురవుతోందని వెంటనే హైడ్రా జోక్యం చేసుకోవాలని ఫిర్యాదులు అందాయి.ఈ ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించి, పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు. ప్రజావాణిలో వచ్చిన అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.ఫిర్యాదుల్లో ముఖ్యంగా మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కండ్లకోయ గ్రామంలో కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని డంపింగ్ యార్డుగా మార్చడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద చెరువులో తమ ప్లాట్లు మునిగిపోయాయని, భూమికి భూమి లేదా తగిన నష్టపరిహారం చెల్లించాలని అక్కడి నివాసితులు కోరారు. చెరువుల అభివృద్ధికి తమకు అభ్యంతరం లేదని, కానీ న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాలాపూర్ మండలం కురుములగూడ జన్నారం కాలనీలో పార్కింగ్ స్థలాల ఆక్రమణపై, నిజాంపేట తుర్క చెరువు పరిసరాల్లో ప్రభుత్వ భూముల కబ్జాలపై, అమీన్‌పూర్ పెద్ద చెరువు నుంచి బందం కొమ్ము చెరువుకు వెళ్లే వరద కాలువ ఆక్రమణలపై కూడా ఫిర్యాదులు వచ్చాయి.



Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073